

మామి'డీలా'

జిల్లా మామిడి దిగుబడులు ఊపందుకున్నా రైతులకు సరైన గిట్టుబాటు లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. - 10లో



కార్యకర్తలను వేధిస్తే ఊరుకోం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా వేధింపులకు గురిచేస్తే ఊరుకోమని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హెచ్చరించారు. - 10లో



అలిపిరికి టోకెన్ల జారీ కేంద్రం

శ్రీవారి మొట్టు మార్గం భక్తుల సౌకర్యార్థం దివ్యదర్శన టోకెన్ల జారీ కేంద్రాన్ని అలిపిరికి మార్చినట్లు ఈఓ పేర్కొన్నారు. - 10లో

న్యూస్‌రీల్

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడి

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాలను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. గత నెల 12 నుంచి 20వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రథమ సంవత్సర జనరల్ విద్యార్థులు 7,985మంది హాజరవ్వగా వారిలో 4,068(51శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులు 4,708మందికి 3,360(71శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో ప్రథమ సంవత్సర విద్యార్థులు 301 మందికి 160(53శాతం) మంది, ద్వితీయ సంవత్సరంలో 244మందికి 188(75శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సర జనరల్, ఒకేషనల్‌లో కలిపి 13,238 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా వారిలో 7,770(59శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో తిరుపతి జిల్లా 4వ స్థానం సాధించినట్లు ఆర్ఐఓ జి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

తిరుపతి నుంచి మూడు రాష్ట్రాలకు ఆర్టీసీ సర్వీసులు



బాలాజీ, తిరుపతి డీఎం

తిరుపతి అర్బన్: తిరుపతి నగరం నుంచి దేశంలోని ముఖ్యమైన అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేయడానికి గతంలోనే ప్రణాళికలు తయారు చేశారు. వాటిని అమలు చేయాల్సి ఉందని తిరుపతి డీఎం బాలాజీ తెలిపారు. ఆయన శనివారం తమ చాంబర్ నుంచి మాట్లాడుతూ ప్రస్తుతం తిరుపతి నుంచి తమిళనాడుకు ప్రతి రోజు 131 నడుస్తున్నాయి, అలాగే తమిళనాడు ఆర్టీసీ నుంచి తిరుపతికి రోజు 136 సర్వీసులు వచ్చిపోతున్నాయి వెల్లడించారు. తిరుపతి నుంచి కర్నాటకకు 41 సర్వీసులు నడుస్తున్నాయని, కర్నాటక నుంచి తిరుపతికి 33 సర్వీసులు వచ్చిపోతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణాకు తిరుపతి నుంచి 62 సర్వీసులు న్నాయని, తెలంగాణ నుంచి తిరుపతికి 61 సర్వీసులు ఉన్నట్లు చెప్పారు. వీటితోపాటు కేంద్రపాలిత ప్రాంతం అయిన పాండిచ్చేరికి నిత్యం ఉదయం, సాయంత్రం బస్ సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు. అయితే తాజాగా ఒడిస్సా రాష్ట్రం వారు ఈ నెల 11 నుంచి పూరి - తిరుపతికి రెండు సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో పూరి నుంచి తిరుపతికి ట్రయల్ రన్‌గా నడిపినట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు.

అత్యాధునికంగా అలిపిరి టోల్ ప్లాజా



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం అలిపిరి టోల్ ప్లాజా సెంటర్‌ను అత్యాధునిక తనిఖీ కేంద్రంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని టీటీడీ ఈఓ శ్యామల రావు ఆదేశించారు. శనివారం ఈఓ తన ఛాంబర్‌లో ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తుల వాహనాలు, లగేజీని తక్కువ సమయంలో స్కాన్ చేయడం వల్ల సమయం ఆదా అవుతుందన్నారు. భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసి తిరుమల చేరుకునే సమయానికి లగేజీ సమాచారాన్ని భక్తులకు అందించే అంశంపై టీటీడీ ఐటీ విభాగం, విజిలెన్స్ కసరత్తు చేయాలన్నారు.

ఈదుల్ అజ్‌హా



త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్‌ను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని ఈద్గా, దర్గాలతో పాటు మసీద్‌లలో సామూహిక ప్రార్థనలు చేశారు. దాన ధర్మాలు చేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. ఎస్వీ యూనివర్శిటీ సమీపంలోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేశారు. - తిరుపతి కల్చరల్

తెప్పోత్సవం



తిరుచానూరులో శనివారం శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారు పద్మపుష్కరిణిలో విహరించారు. - చంద్రగిరి

పెద్ద శేష వాహనంపై చిద్విలాసం



అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనంపై శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. - వడమాలపేట (విజయపురం)

కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ గందరగోళంగా మారింది. ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో సీనియారిటీ జాబితాల్లో అవకతవకలు, బదిలీల కసరత్తులో నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు రావడం విమర్శలకు తావిస్తోంది. ప్రిఫరెన్షియల్ కేటగిరీ నమోదు చేసుకున్న టీచర్లకు దూరంగా పోస్టింగ్‌లు ఇవ్వడం, కొందరికైతే బదిలీల ఉత్తర్వులు జారీచేయకపోవడం కన్నీళ్లు తెప్పిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న బదిలీల కసరత్తుపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..



చిత్తూరు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బదిలీల్లో నష్టపోయిన టీచర్లు

అయ్యోర్లు బదిలీ!

ముప్పతిప్పలు పెడుతున్న కూటమి ప్రభుత్వం

- నిబంధనలకు విరుద్ధంగా బదిలీల ఉత్తర్వులు
- ఎస్జీటీలకు హ్యాండిచ్చిన వైనం
- రాష్ట్ర విద్యాశాఖ అధికారులను వెళ్లి అడగండంటూ నిర్లక్ష్య సమాధానం
- ఆప్షన్ల బాయ్‌కాట్‌కు పిలుపునిచ్చిన ఐక్య ఉపాధ్యాయ సంఘ నాయకులు



చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అయ్యోర్లకు వేసవి సెలవుల ప్రారంభం నుంచే బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు మొదలైంది. ఈ కసరత్తు వేసవి సెలవులు పూర్తి కావొస్తున్నా ఇంత వరకు పూర్తికాని దుస్థితి నెలకొంది. విద్యాశాఖ అధికారుల వద్ద ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా సరిగా లేకపోవడం, ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన బదిలీల్లో దరఖాస్తుల నమోదు దగ్గర నుంచి బదిలీల ఉత్తర్వుల జారీ అయ్యే వరకు అన్నీ సమస్యలే ఎదురవడం అయ్యోర్లకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లు నిత్యం చిత్తూరు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తోంది. సమస్యలు విన్నవిస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

క్రిమినల్ కేసులు పెడతామని బెదిరింపులు

బదిలీల్లో అవకతవకలు, సమస్యలు పరిష్కరించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారు. దీనికితోడు 'రాష్ట్ర విద్యాశాఖ అధికారులను వెళ్లి అడగండి'.. అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నట్టు అయ్యోర్లు ఆరోపిస్తున్నారు. బదిలీలు ఆన్‌లైన్ విధానంలో జరిగాయి.. మాకు ఎలాంటి సంబంధం లేదు అంటూ చేతులు పైకెత్తేస్తున్నట్టు సమాచారం. గట్టిగా అడిగితే వారిపై క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగుతున్నట్టు తెలుస్తోంది. సీఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో జరుగుతున్న ఈ తతంగంపై క్షేత్ర స్థాయిలో అయ్యోర్లు దుమ్మెత్తి పోస్తున్నారు.


ఇదేందయ్యా లోకేశం!

బదిలీల్లో అవకతవకలు, గందరగోళంపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లు, నాయకులు విద్యాశాఖ మంత్రి లోకేష్ సారూ.. ఇవేం బదిలీలయ్యా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ఇచ్చిన నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారమే ఎస్జీటీల బదిలీలు మాన్యువల్ విధానంలో నిర్వహించాలని కోరుతున్నారు. మాట తప్పి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఆదేశిస్తుండడంపై అయ్యోర్లు, నాయకులు ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 8న డీఈవో కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చారు. మరికొంత మంది డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

పేరుకే నిబంధనలు

టీచర్ల బదిలీల కసరత్తుకు జారీచేసిన జీవోలు, నిబంధనలు పేరుకు మాత్రమేనని టీచర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. కసరత్తు మొత్తం విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారంగా, గందరగోళంగా నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. బదిలీల్లో నిబంధనల ప్రకారం వారికి నమోదయ్యే పాయింట్ల ప్రకారం వెబ్ ఆప్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు.

ఉపాధ్యాయులకు ముచ్చెమటలు



ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అయ్యోర్లకు కూటమి ప్రభుత్వం ముచ్చెమటలు పట్టిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బదిలీలు, ఉద్యోగోన్నతుల రూపంలో కక్ష సాధింపులకు పాల్పడుతోంది. ఈ బదిలీల కసరత్తులో చిత్ర విచిత్ర సమస్యలను సృష్టిస్తోంది. వాటిని పరిష్కరించకుండా ఏకపక్షంగా బదిలీల కసరత్తును ముందుకు సాగిస్తోంది.

ఇవిగో సమస్యలు

- ఉద్యోగోన్నతులు పొందలేక నష్టపోతున్న 610 జీవో బాధిత పీఈటీలకు న్యాయం చేయాలి.
- ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి.
- క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిపి ముందుగా ఇచ్చిన ఆప్షన్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలి.
- రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీల వెబ్ సైట్లో తప్పనిసరి బదిలీగా చూపడం అన్యాయం.
- తుది సీనియారిటీ జాబితా విడుదల చేయకుండా, ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడం బాధాకరం
- ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న ఖాళీలను కేటాయించకపోవడంతో తర్వాత సదరు ఖాళీలను పదోన్నతుల్లో చూపడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారు.
- కొన్ని ఖాళీలను సీనియర్ ఉపాధ్యాయులు ముందుగా బదిలీ కోసం ఎంపిక చేసుకున్నప్పటికీ వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించారు
- కొన్ని పాఠశాలల్లో ఒక పోస్టు ఖాళీగా ఉండగా సదరు ఖాళీ పోస్టును ఇద్దరు ఉపాధ్యాయులకు కేటాయించడం..
- ప్రాధాన్యత కేటగిరి ఉపాధ్యాయులు వారి ప్రాధాన్యతను రద్దు చేసుకుని జనరల్ కేటగిరి కింద ఆప్షన్ ఇవ్వగా సదరు ఎంపిక చేసుకున్న స్థానాలను వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించడం..

తీవ్రమైన అన్యాయం



ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుని కచ్చితమైన బదిలీలు పొందే టీచర్లకు తీవ్రమైన అన్యాయం జరిగింది. నమోదు చేసుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఇష్టానుసారంగా బదిలీలు చేశారు. గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ పరిధిలోని అన్ని సబ్జెక్టుల టీచర్లకు ఈ సమస్య ఉంది. విద్యాశాఖ మంత్రి చొరవ తీసుకుని మాకు న్యాయం చేయాలి.

– ఉజ్వల, స్కూల్ అసిస్టెంట్

యూనిట్లు ఉన్నచోటే బదిలీ చేయాలి



బదిలీల చట్టం ప్రకారం జిల్లాలో ఎన్‌సీసీ టీచర్లకు వాళ్ల యూనిట్లు ఉన్న చోటకే బదిలీ చేయాలి. లేదంటే అక్కడే కొనసాగించాలి. కానీ ఈ బదిలీల్లో ఆ విధంగా చేయకుండా ఇతర సీనియారిటీల్లో తక్కువ ఉన్న టీచర్లను బదిలీ చేశారు. వారి స్థానాల్లోకి వేరే వారిని నియమించారు.

– జనార్దన్, ఎన్‌సీసీ టీచర్

జూనియర్లకు మంచి ప్రాంతాలు



ఈ బదిలీల్లో జూనియర్లకు మంచి ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. మంచి పాయింట్లు ఉన్న సీనియర్లకు దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో కచ్చితంగా బదిలీ కావాల్సిన వారు 18 చూపించారు. వారికి సరిపోయే పోస్టులు లేవని ఒరిజనల్, క్లస్టర్ పోస్టులు కలుపుకుని చూపించారు. రీ కౌన్సిలింగ్ పెట్టాలి.

– రాధిక, స్కూల్ అసిస్టెంట్

పారదర్శకంగా లేదు



టీచర్ల బదిలీలకు నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ పారదర్శకంగా ఉంటుందనుకున్నాం. కానీ చాలా మంది టీచర్లకు బదిలీల్లో అన్యాయం జరిగింది. మొదటి ర్యాంకు ఉన్న టీచర్‌కు లాస్ట్‌లో నమోదు చేసుకున్న చోట పోస్టింగ్ ఇవ్వడం చాలా దారుణం. ప్రిఫరెన్షియల్ కేటగిరీ (తీవ్ర అనారోగ్యం)తో నమోదు చేసుకున్న వారికి దూర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు.

-మణిగండన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, చిత్తూరు.

మాట తప్పడం అన్యాయం



రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సంఘ నాయకులతో నిర్వహించిన చర్చల్లో స్పష్టమైన హామీలిచ్చి ప్రస్తుతం మాట తప్పడం అన్యాయం. వెబ్ ఆప్షన్స్‌పై టీచర్లల్లో నమ్మకం పోయింది. తక్కువ మంది ఉన్న హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లకే వెబ్ ఆప్షన్స్‌లో అనేక సమస్యలున్నాయి. సమస్యల పరిష్కారం కోసం డీఈవో కార్యాలయం ముట్టడికి సిద్ధమయ్యాం.

– జీవీ.రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సీనియారిటీ ప్రకారం పోస్టింగ్స్ ఇవ్వలేదు



నేను గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్. సీనియారిటీ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ప్రకారం పోస్టింగ్స్ ఇవ్వలేదు. మాకంటే తక్కువ ర్యాంకులున్న వారికి 20, 30 కి.మీ దూరంలో బదిలీలు చేశారు. పెద్దపంజాణి నుంచి సత్యవేడుకు బదిలీ చేశారు. ఇదెక్కడి న్యాయం.

– రెడ్డెప్ప, స్కూల్‌అసిస్టెంట్

శ్రీవారి దర్శనానికి 20గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వ దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయి, క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 72,174 మంది స్వామివారిని దర్శించుకోగా 35,192 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారి హుండీలో రూ.2.88 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.



విజన్ డాక్యుమెంట్స్ సిద్ధం చేయండి



వెంకటేశ్వర్, జిల్లా కలెక్టర్

తిరుపతి అర్బన్ : విజన్ డాక్యుమెంట్స్ 2047కు సంబంధించి ఏ పనులు చేపట్టాలనే అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి అధికారులతో సమీక్షించారు. ఈనెల 9న సీఎం చంద్రబాబు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌పై వర్చువల్‌గా జిల్లా అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. అలాగే ఏడాది కాలంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వాటిని, శంకుస్థాపనకు సిద్ధంగా ఉన్న వాటిని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అలాగే ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాలపై అవగాహన పెంచాలని సూచించారు. ఆదివారం డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించే సీనియర్ సిటిజన్ యోగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ఈనెల 9న సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాలు, డివిజన్, జిల్లా ప్రధాన కేంద్రంలో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, ఆర్ఐఓలు యోగా పై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని చెప్పారు.



క్లుప్తంగా

కక్ష సాధింపుతోనే కేసులు



కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్సీ , గూడూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరుగ మురళీధర్ పేర్కొన్నారు. ఇటీవల గూడూరు మండలం పోటుపాళెం పంచాయతీకి చెందిన పురుటిపాళెంకు చెందిన దయాకర్‌తో పాటు మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారని, వారు బెయిల్‌పై శనివారం విడుదల కావడంతో వారిని పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అన్యాయంగా కేసులు నమోదు చేసి భయాందోళనలకు గురి చేస్తున్నారని దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. తగిన సమయంలో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హితవు పలికారు. అక్రమ కేసుల్లో ఉన్న ప్రతి కార్యకర్త, నాయకుడికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువత కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, నాయకులు అశోక్, తదితరలు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్



శైలజకు సాధికారత పుస్తకాన్ని అందజేస్తున్న నల్లాని రాజేశ్వరి

చంద్రగిరి : రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ శనివారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త నల్లాని రాజేశ్వరి, మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసి సత్కరించి, సాధికారత పుస్తకాన్ని అందజేశారు. అనంతరం ప్రతి మహిళా సాధికారత దిశగా ముందుగా సాగేలా చేయూతనందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మణి మృతదేహం

నాయుడుపేటటౌన్ : బైక్‌పై వెళుతున్న వ్యక్తి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మైలురాయిని ఢీకొని పూడేరు మణి(35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నరసారెడ్డి కండ్రిగ-కృష్ణామనాయుడు కండ్రిగ గ్రామాల మధ్య రహదారిపై శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. చిట్టమూరు మండలం గునపాడు గ్రామానికి చెందిన మణి నాయుడుపేటలో పనులు చూసుకుని సాయంత్రం బైక్‌పై గ్రామానికి వెళుతుండగా మార్గ మధ్యలో నరసారెడ్డి కండ్రిగ దాటిన తరువాత బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న మైలు రాయిను ఢీకొంది. ఈ ప్రమాదంలో మణి తీవ్రంగా గాయపడి అక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కార్యకర్తలను వేధిస్తే ఊరుకోం

- టీడీపీ నేతలా వ్యవహరిస్తున్న సీఐ
- పసుపు చొక్కా వేసుకోండంటూ సీఐపై మండిపాటు
- తిరుపతి రూరల్ సీఐపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆగ్రహం
- బాధితులతో కలిసి డీఎస్పీకి ఫిర్యాదు



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ముందు వైఎస్ఆర్‌సీపీ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీలో జరిగిన వివాదంపై శనివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బాధితులతో కలిసి సీఐ చిన్నగోవిందుతో పాటు గొడవలకు కారణమైన వారందరిపై చర్యలు తీసుకోవాలని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీ సర్పంచ్ ముసుకు కోటేశ్వరరావు జన్మదినం సందర్భంగా తన ఇంటి వద్ద శుక్రవారం రాత్రి జన్మదిన వేడుకలు జరుపుకుంటుండగా స్థానిక టీడీపీ మహిళా నేత హేమలత, ఆమె కుమారుడు చిట్టి.. సర్పంచ్ ఫ్లెక్సీలను చించివేశారు. దీంతో తమ ఫ్లెక్సీలు ఎందుకు చింపుతున్నారని అడిగిన సర్పంచ్ కోటేశ్వరరావుతో పాటు అతని భార్య ముని పుష్పపై దాడి చేశారన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడైనా పల్లెల్లో ఏదైనా గొడవ జరిగితే పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి శాంతియుత పద్ధతిలో అణచివేస్తారన్నారు. కానీ తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు మాత్రం గొడవలకు గల కారణాలు తెలుసుకోకుండా సర్పంచ్ ఇంటికి బర్త్‌డే పార్టీకి వచ్చిన గ్రామస్తుల అందరిపై లాఠీ చార్జి చేయడం, అక్కడ టీడీపీ ఫ్లెక్సీలు అలాగే ఉండగా, వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను బలవంతంగా తాను సీఐ అన్న విషయం మరిచి ఆయనే చించివేయడం, తన సిబ్బంది చేత చించివేయించడం వంటి పనులు చేశారన్నారు. అలా చేయడం పోలీసులకు తగదని, ఖాకీ చొక్కా వేసుకుని అలాంటి పనులు చేయడం కంటే పసుపు చొక్కా వేసుకుని చేస్తే బాగుంటుందని మోహిత్‌రెడ్డి హితవు పలికారు.

పోలీస్ స్టేషన్‌లోనూ కవ్వింపు చర్యలు

తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌కు బాధితులతో కలసి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు డీఎస్పీని కలవడానికి వస్తారని తెలుసుకున్న సీఐ చిన్నగోవిందు ముందుగానే టీడీపీకి చెందిన వర్గీయులను అక్కడకు పిలిపించుకున్నట్లు బాధిత వర్గాలు చెబుతున్నాయి. పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు అక్కడకు చేరుకోవడంతో లింగేశ్వర నగర్‌కు చెందిన టీడీపీ వర్గీయులు పోలీస్ స్టేషన్ ఆవరణలోనే పోలీసులు చూస్తుండగానే బూతులు తిడుతూ వారిని రెచ్చగొట్టేలా వ్యవహరించారన్నారు. అనంతరం సీఐ చిన్నగోవిందు చర్యలను తప్పుబడుతూ కొంత సేపు నిరసన వ్యక్తం చేసి వెళ్లారు.

సీఐ ఏకపక్ష ధోరణి

గతంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి టీడీపీ వాళ్లపై ఫిర్యాదులు తీసుకోకుండా సీఐ ఏకపక్షంగా వ్యవహరించారని మోహిత్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఒకరు ఏదో పోస్టు పెట్టారని అతడిపై కక్ష గట్టి స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి చేయడంతో అక్రమంగా అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు పంపించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలనే టార్గెట్‌గా పెట్టుకుని వేధింపులకు దిగుతున్న సీఐపై న్యాయ పోరాటం చేస్తామని, అంతకంటే ముందు ఆయన పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తమ ఫిర్యాదుపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానంలో ప్రైవేటు కేసులు వేస్తామన్నారు. లింగేశ్వరనగర్ పంచాయతీలో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు చేసిన అరాచకం వీడియోలను కోర్టు ముందు పెట్టి కచ్చితంగా ఆయనపై కేసులు నమోదయ్యేలా చూస్తామని, అంతకంటే ముందుగా తమ పార్టీ సర్పంచ్ ఫ్లెక్సీలు చించివేసి గొడవకు కారకులైన వారందరిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెంట పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

9 నుంచి టీటీడీ కళాశాలల్లో అడ్మిషన్లు



తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల భవనం

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర (ఎస్వీ), శ్రీపద్మావతి మహిళా (ఎస్పీడబ్ల్యూ) జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 9వ తేదీ నుంచి తొలివిడత అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించనున్నారు. ఆ మేరకు ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రకాష్‌బాబు తెలిపారు. ఎస్వీ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్, తెలుగు, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్వీ జేసీలో 792 సీట్లకు దాదాపు 5,200 మంది, ఎస్పీడబ్ల్యూ జేసీలో 968సీట్లకు దాదాపు 9వేల మంది విద్యార్థులు టీటీడీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేశారని, ఆయా విద్యార్థులకు ఇదివరకే సమాచారాన్ని అందించినట్లు పేర్కొన్నారు. వీరికి 9వ తేదీ నుంచి తొలివిడత అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తారని, మిగిలిన సీట్లకు మలివిడత అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించి భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అడ్మిషన్లు పొందిన ఆర్ట్స్ విద్యార్థులు రూ.4,400/-, సైన్సు విద్యార్థులు రూ.5,350/- ఫీజు చెల్లించాలని చెప్పారు. హాస్టల్‌లో సీటు పొందిన వారు హాస్టల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజనల్ టీసీతో పాటు వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసిన అన్ని ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.

అలిపిరికి టోకెన్ల జారీ కేంద్రం



భూదేవి కాంప్లెక్స్ వద్ద టోకెన్లజారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : శ్రీవారి మెట్టు మార్గం ద్వారా కాలినడకన వెళ్లే దివ్యదర్శనం భక్తుల సౌకర్యార్థం దివ్య దర్శనం టోకెన్ల జారీ కౌంటర్లను అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చినట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఈఓ భూదేవి కాంప్లెక్స్, అలిపిరి టోల్ ప్లాజాలను పరిశీలించారు. శ్రీవారి మెట్టు వద్ద భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారనే ఫిర్యాదులు రావడంతో తాత్కాలికంగా శుక్రవారం సాయంత్రం నుంచి మార్చామన్నారు. శ్రీవారి మెట్టు మార్గం ద్వారా కాలినడకన వెళ్లే భక్తులకు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో రోజుకు సరాసరి 5 వేల టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. శ్రీనివాస మంగాపురంలో టోకెన్లు జారీ చేసేందుకు ఆర్కియాలజీ శాఖ అనుమతి రాగానే అక్కడ టోకెన్లు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

కూరగాయల దుకాణంలో చోరీ

చంద్రగిరి: కూరగాయల దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు.. చంద్రగిరి పాతపేట కావమ్మగుడి వీధికి చెందిన సురేష్ బాబు, బజారు వీధిలో కొన్నేళ్లుగా కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారు జామున దుకాణం వద్ద పరిశీలించగా సుమారు రూ.35 వేల విలువైన 5 బస్తాల తెల్లగడ్డలు , రెండు బస్తాల ఎర్రగడ్డలు, ఒక బస్తా బంగాళదుంపలు, త్రాసు, రూ.3,500 నగదును దోచుకెళ్లినట్లు గుర్తించారు. అనంతరం సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీకి పాల్పడినట్లుగా తెలిసిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మూడు నెలల కిందట ఇదే దుకాణంలో చోరీ జరగడం గమనార్హం.

మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని తిరుపతికి వెళుతున్న భక్తుల వాహనం 19వ మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. సకాలంలో టీటీడీ సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఒకే ఒక్కడు

అన్నదాతకు అండగా..
వైఎస్సార్ రైతు భరోసా



- 8,73,146 మంది రైతులకు రూ.663.07 కోట్లు పెట్టుబడి సాయం
- ఏటా రూ.13,500 సేద్యం కోసం రైతుకి సాయం
- రెండు సీజన్‌ల్లో తెలుగు గంగనీరు..రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం



వరదయ్యపాళెంలోని ఆర్‌బీకేలో ఎరువుల పంపిణీ (ఫైల్)

తిరుపతి అర్బన్ : రబీ, ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకు పంట పెట్టుబడులు, సేద్యం ఖర్చులకు గత వైఎస్సార్‌సీపీ సర్కార్ ఐదేళ్ల పాటు (2019–24)వరుసగా క్రమం తప్పకుండా జిల్లాలో 8,73,146 మంది రైతులకు రూ.663.07 కోట్లు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించారు. దీంతో రైతులు అప్పులు చేయకుండా సర్కారు ఇచ్చిన రైతు భరోసాతోనే వ్యవసాయం పండుగలా చేశారు. గత ఐదేళ్ల పాలన స్వర్ణయుగమేనంటూ అన్నదాతలు చర్చించుకుంటున్నారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నకిలీ విత్తనాలకు స్వస్తి చెప్పి...నాణ్యమైన విత్తనాలు రాయితీలతో ఇవ్వడం, యూరియా కృత్రిమ కొరత లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఉచిత పంట బీమా కల్పించింది. దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీలను అందించి రైతులను ఆదుకుంది. పెట్టుబడి సాయంగా రైతులకు ఏటా రూ.13500 క్రమం తప్పకుండా ఇవ్వడం, కౌలు రైతులకు బ్యాంక్ రుణాలు ఇప్పించి గత జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. తెలుగుగంగ 40 ఏళ్ల చరిత్రలో ఎప్పుడు లేని విధంగా రబీతోపాటు ఖరీఫ్‌లోనూ సాగునీరు ఇవ్వడంతో జిల్లాలో ఏటా 70 వేల నుంచి 80 వేల ఎకరాల బీడు భూములు సైతం సాగులోకి తీసుకొచ్చిన రైతు బాంధవుడిగా ఒకే ఒక్కడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు మదిలో నిలిచిపోయారు.

వైఎస్సార్ రైతు భరోసా నిధుల (2019-24) వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి పొందిన మొత్తం(రూ.కోట్లలో)
2019–20	1,55,207	119.97
2020–21	1,79,030	134.81
2021–22	1,81,711	136.55
2022–23	1,76,435	134.73
2023–24	180,763	137.01

మామిడీలా

- గిట్టుబాటుపై ఆందోళన
- రైతులకు సర్కారు భరోసా కరువు



తిరుచానూరు మామిడికాయల మండికి చేరుకుంటున్న తోతాపురి రకం మామిడి

తిరుపతి అర్బన్ : జిల్లాలో 60 వేల ఎకరాల్లో మామిడి సాగులో ఉంది. ఈ ఏడాది పంట దిగుబడి రెండు నెలలు ఆలస్యంగా వచ్చింది. ఎప్పుడు లేని విధంగా పూత పెద్ద ఎత్తున రాలిపోయింది. 60 వేల ఎకరాల్లో 3.75 లక్షల టన్నుల మామిడి దిగుబడి వస్తుందని అంచనా. మామిడి గుజ్జు పరిశ్రమ నిర్వాహకులు సిండికేట్ కావడంతో మార్కెట్‌లో మామిడికి నామమాత్రపు ధరలకు అడుగుతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు.

పరిశ్రమ నిర్వాహకుల కష్టాలు

మామిడి గుజ్జు పరిశ్రమల నిర్వాహకులు కూడా తమ వద్ద 1.60 లక్షల టన్నుల గుజ్జు నిల్వలున్నాయని చెబుతున్నారు. వాటిని విక్రయిస్తేనే పెట్టిన పెట్టుబడులు వస్తాయని కానీ ఏడాదిగా నిల్వ ఉండడంతో బ్యాంక్‌లకు చెల్లించాల్సిన రుణాలను కట్టలేకపోతున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం కారణంగా ఎగుమతులు ఆగిపోయాయని దీంతోనే సరైన ధరలకు కొనుగోలు చేయలేక పోతున్నామంటున్నారు.

తోతాపురి టన్నుకు రూ.12 వేలు ఇవ్వాలని

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తోతాపురి మామిడికి టన్నుకు రూ.12 వేలు చొప్పున కొనుగోలు చేయాలని ఇటీవల ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచించారు. అయితే ఇందులో టన్ను రూ.8 వేలు లెక్కన ఫ్యాక్టరీ యాజమాన్యం తీసుకుంటే...మిగిలిన రూ.4 వేలు రైతుల ఖాతాల్లో సర్కార్ జమ చేస్తుందని వెల్లడించారు. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం తమిళనాడు రాష్ట్రం నుంచి తోతాపురి టన్ను కేవలం రూ.4 వేలకే లభిస్తుండడంతో కొనలేకపోతున్నారు. మరోవైపు జిల్లాలో ఒక్కో రైతు తిరుచానూరులోని మామిడి కాయల మండికి తోతాపురిని పంపుతున్నారు. జులై ఆఖరుకు జిల్లా వ్యాప్తంగా మామిడి పంట కోతలు పూర్తి కానున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మామిడికి గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



రైలు పట్టాలపై ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నాయుడుపేటటౌన్ : ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి నాయుడుపేట రైల్వే స్టేషన్ వద్ద మృతి చెందిన ఘటన శనివారం సూళ్లూరుపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ మాల కొండయ్య తెలిపిన మేరకు వివరాలు ఇలా.. చెన్నై ఈ రోడ్ నుంచి జబల్‌పూర్‌నకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతి చెందినట్లుగా స్టేషన్ సూపరింటెంట్ లక్ష్మీనారాయణ గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి చేతిపై ఇంగ్లీష్‌లో జ్యోతి పేరుతో టాటు వేసుకుని ఉన్నట్లు వెల్లడించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.